**మధ్యతరగతి భార్యాభర్తలకు కష్టం కలిగించే అనుభవాలెన్నో జీవితంలో! వాళ్ళ మనసులో ఒకరిమీదొకరికి ప్రేమ వుంటే ఆ కష్టం కూడా యిష్టంగానే మారు తుంటదేమో!**

# వెన్నెల కురిసిన రాత్రి

కొన్నిగంటల క్రితం తనకు, భర్తకు జరిగిన వాగ్వివాదంతో మనసులో పెద్ద తుపాను చెలరేగి అల్లకల్లోలమైన హృదయంతో ఆలోచిస్తూ అన్నీ మర్చిపోయి కూర్చుంది శర్వాణి.

'ఇన్నేళ్ళు వైవాహిక జీవితంలో ఎన్నడూ ఒక్కమాట పట్టింపుకూడా రానిది ఈ రోజు ఎందుకిలా జరిగింది? నాలో ఓర్పు నశిస్తున్నదా? ఆయనలో మార్పు వస్తున్నదా? పదేళ్ళ శ్వేత పట్టు పరికిణీ కోసం ఇంత గొడవా?'

చివరిగా భర్త అన్నమాటలు పదేపదే గుర్తు తెచ్చుకుంటూ పదునైన కత్తులు ఒళ్ళంతా గుచ్చినట్లు బాధపడసాగింది శర్వాణి....

"భార్యా పిల్లలకు కనీస కోరికలుకూడా తీర్చలేని నేను అసలు పెళ్ళి చేసుకోకుండా వుండాల్సింది. నిజంగా నేను అసమర్థుడ్ని శర్వాణీ!" "ఆయన మనసు ఎంత బాధ పడితే అలాంటి మాటలు అన్నారో! పాపిష్టిదాన్ని. నేనే వూరుకోవాల్సింది." తనను తానే తిట్టుకుంటున్నది.

ఇంతలో మోహన్ స్నానం చేసి బాత్ రూంలోనుంచి బైటకొచ్చాడు. అతని మనసు బాధతో నిండిపోయివుంది.

భర్త ఎదురుపడటానికి సిగ్గుపడు తున్నది శర్వాణి. ఆఫీసు టైం అవుతున్న దని తొందర తొందరగా వంటచేసి అన్నీ టేబిలుమీద సిద్ధంచేసి. టిఫిన్‌బాక్సు సర్ది రడీగా వుంచింది.

భార్యతో మాట్లాడదామంటే మనసు మారాం చేస్తున్నది వద్దని. భోజనం పెట్టిందో, లేదోనని ఒకసారి చూశాడు. మోహన్. కంచంలో అన్నంపెట్టి నిలబడి వుంది శర్వాణి.

మౌనంగా వచ్చి కూర్చుని భోజనం చేయసాగాడు మోహన్. రోజూలాగానే దగ్గరవుండి ఏమి కావాలో మాట్లాడకుండా పెడ్తున్నది.


ఎప్పుడూ కొట్టుకుని, తిట్టుకుంటూ గడిపే భార్యా భర్తలకు అది సహజంగా రెండుపూటలా అన్నం తిన్నంత మామూలుగా వుంటుంది. కాని శర్వాణి. మోహన్ పరిస్థితి అలాలేదు. ఇద్దరికి ఇద్దరూ జరిగిం దానికి చాలా బాధపడుతున్నారు. కాని మనసు విప్పి చెప్పుకోలేకపోతున్నారు.

మాట్లాడకుండా అన్నం తింటున్న భర్తనుచూసిఅంతవరకూ బిగపట్టుకున్న కళ్ళ నీళ్ళు టపటప టేబుల్ మీద పడ్డాయి. వెంటనే ఒకసారి కళ్ళెత్తి భార్య మొహం లోకి చూసిన మోహన్ మరుక్షణంలో కంచంలో చెయ్యి కడుక్కుని చకచక ఆఫీసు కెళ్ళిపోయాడు.

ఆఫీసు కెళ్ళుతున్న భర్త చేతులు పట్టు కుని "ఇంట్లో యిబ్బందులు. బాధ్యతలు తెలిసికూడా నేను అవివేకంగా ప్రవర్తించి నందుకు నన్ను క్షమించండి. ఇలాంటి పొరపాటు యికముందు రానివ్వను. మీ మనసు కష్టపడే మాటలు యెప్పుడూ అన నని, మన పిల్లలు. శ్వేత. రవి మీద ప్రమాణంచేసి చెప్పుతున్నాను. ఈ చిన్న తప్పును మన్నించండి" అనాలనుకున్నది. కాని అప్పటికే బాధతో. దుఃఖంతో. వేద నతో పూడిపోయిన గొంతు ఆ మాటలు అనలేకపోయింది.

భర్త సరిగా అన్నం తినకుండా చెయ్యి కడిగిన కంచం చూస్తూ. ఆ పూట తను అసలే భోజనం చేయలేదు శర్వాణి ...

'ఆలుమగల మనస్పర్థలు అద్దం మీద ఆవగింజలాగ జారిపోవాలంటారు. ఈ రోజు సంఘటన అద్దంమీద గుండ్రాయి లాగ వుండి అద్దాన్నే బద్దలుచేస్తుందా?' శర్వాణి యిలా తనలో తను అనుకోసా గింది. "ఆయనకు కోపం వచ్చి అన్నం తినకుండా వెళ్ళారా? ఈ మధ్య శ్వేత.



## భండారు విమలాదేవి

ఎదురింట్లో అమ్మాయి స్మిత పట్టు పరికిణీ కుట్టించుకున్నదని, అలాంటిదే తనకూ కావాలని ఒకటే మారాంచేసింది. దాని చిన్న మనసుకు మన కష్టసుఖాలు చెప్పినా అర్థం చేసుకునే జ్ఞానం లేదు. పట్టుపరికిణీ అడిగిన నేరానికి కొట్టి చెప్పలేము.

అందుకే వుదయం ఎలాగైనా దానికి పరికిణీ కొనాలనే వుద్దేశంతో ఆయనను అడిగాను.

"పట్టుది కుట్టించాలంటే కనీసం మూడు వందలైనా వుంటాలి. అంత డబ్బు ఎక్కడిది శర్వాణీ ! మనకున్న బాధ్యతలు.మన సంసారం నీకేమీ కొత్తకాదు !"

"నేను బ్రతికున్నంతవరకు మీరు ఈ బాధ్యతల వలయంనుంచి బైటపడరు" ఆవేశాన్ని ఆపుకోలేక అనేశాను.


అంతే ! ఆయన నా మొహంలోకి చూసిన చూపు. అన్నమాటలు నన్ను పశ్చాత్తాపానికి గురిచేసినయ్.

"అమ్మా ! స్మిత పట్టుపరికిణీ టైలరు తీసుకొచ్చాడే. ఎంత బాగుందో ! నాకు ఈ రోజు తీసుకుంటావా ? నాన్నగార్ని అడిగావా ?" అంటూ పరుగు పరుగున వీధిలోనుంచి వచ్చింది శ్వేత. తప్పకుండా ఈ రోజు తనకు పట్టు పరికిణీ కొంటానని ఎంతో ఉత్సాహంగా, నమ్మకంగా వున్న కూతురుతో అసలు సంగతి చెప్పలేకపోయింది శర్వాణి.

వెంటనే తనకు వచ్చిన ఆలోచనను ఆచరించటానికి, కూతుర్ని వళ్ళోకి తీసుకొని– "బుజ్జీ! నీకు స్మిత పట్టు పరికిణీ లాంటిది దీపావళికి కొంటాను, ఎందుకంటే ఈ మధ్య నాన్నగారికి జ్వరమొచ్చినపుడు చాలా రోజులు ఆఫీసుకెళ్ళలేదు నాన్నగారు. అందుకని వాళ్ళు జీతం ఇవ్వరు. డబ్బులు యివ్వకపోతే ఏ షాపు వాడిస్తాడు చెప్పు!

ఇప్పుడు నా పట్టుచీరెతో నీకు పరికిణీ కుట్టిస్తాను. టైలరు దగ్గరకు వెళ్దాము పద" అని పెళ్ళికి పెట్టిన ఒక్క పట్టుచీరె తీసుకుని, కూతుర్ని వెంటపెట్టుకుని పక్క వీధిలో వున్న టైలరు దగ్గరికి వెళ్ళింది శర్వాణి.

అతను కొలతలు తీసుకుని మిగిలిన దాన్ని పర్రున చించి ఇచ్చాడు. శర్వాణి మనసు బాధగా మూలిగింది–'ఎన్ని పేరంటాలో, ఎన్ని పెళ్ళిళ్ళో ఈ చీరెతో చేసింది! ఇకనుంచి ఇదికూడా వుండదు.



కూతురి కోరిక తీరటానికి ఇంతకన్నా మార్గం ఏముంది ?' ఇంటివాకా వచ్చేవరకు ఇంటిముందు రెండురిక్షాలు ఆగివున్నాయి. అందులోనుంచి అత్తగారు, ఇద్దరాడబిడ్డలు దిగుతున్నారు. రెండో ఆడబడచుకు మూడో పురుడు పోయటానికి వెళ్ళిన అత్తగారు పెద్ద కూతుర్ని, పురుడు పోసిన కూతుర్ని, పిల్లల్ని తీసుకుని వచ్చింది.

ఎక్కడికెళ్ళి వస్తున్నావని కోడల్ని అడిగింది అత్తగారు. శ్వేతను చూపిస్తూ "ఇది పట్టు పరికిణీ కావాలంటే నా చీరె చించి కుట్టించటానికి వెళ్ళి వస్తున్నా" నంటూ చెప్ప ఆడబిడుచు చంటివాడిని

యెత్తుకుని యింట్లోకి వచ్చింది శర్వాణి.

ప్రొద్దున జరిగిన గొడవ అప్పుడు శ్వేత వున్నట్లయితే వాళ్ళ బామ్మతో అంతా పూసగుచ్చినట్లు చెప్పేది.

భార్యా భర్తలమధ్య వచ్చిన తగాదాలను మూడో మనిషితో చెప్పటం అంటే అసలు నచ్చదు శర్వాణికి.

ఇతరులవల్ల వచ్చినా, దైవికంగా వచ్చినా వాళ్ళిద్దరే నేర్పుతో, ఓర్పుతో పరిష్కరించుకోవాలిగాని, మూడోవాళ్ళకు తెల్పిందంటే ప్రపంచం అంతా తెల్పినట్లే అనుకోవాలి. తరువాత అందరిముందూ తలెత్తుకొని తిరగలేము. ఆ అవమానము భరించలేము— అని శర్వాణి వుద్దేశం. అందుకే అత్తగారు, ఆడబిడ్డలు వచ్చినప్పటినుంచి ఎటువంటి బాధా మొహంలో కనబడనివ్వకుండా మనసులోనే పదిలంగా దాచుకొని కబుర్లు చెపుతూ సంతోషంగా తిరుగుతున్నది.

ఆఫీసుకెళ్ళి ఫైళ్ళు టేబుల్ మీద పరుచుకుని పని చేయటానికి కూర్చున్న మోహన్‌కి వచ్చేటప్పుడు తను చూసిన భార్య మొహమే దీనంగా కనబడుతున్నది. వెంటనే ఇంటి కెళ్ళాలనిపిస్తున్నది. భార్య ఇంకా ఏడుస్తూనే కూర్చుందేమో...అదే అతని బాధ.

ఉదయం జరిగిన దాంట్లో తనదే పొరపాటు అనిపిస్తుంది మోహన్‌కి. అందుకే అన్ని విషయాల్లో మొగవాళ్ళకంటే ఆడవాళ్ళకే ఓర్పు, సహనం ఎక్కువంటారు. ఆఫీసు పని మానుకుని భార్యను గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు మోహన్.

'నిజంగా శర్వాణి నా పాలిట దేవతనే చెప్పాలి. ఎలాంటి క్లిష్ట పరిస్థితిలోకూడా నాకు చక్కటి సలహాలు చెప్పేది. ఇంట్లో ఎంతమంది వున్నా నా పనులన్నీ తనే స్వయంగా చేస్తుంది. ఎప్పుడూ ఎటువంటి లోపం రానివ్వదు. ఇక భోజనం విషయంలో ఎంత చేతకాకపోయినా, వంట్లో బాగుండకపోయినా తనే దగ్గర కూర్చుని వడ్డించాలి.

శర్వాణి అన్నందగ్గర కూర్చుని అలా పెట్టకపోతే ఆ రోజు నాకు లంఖణం చేసినట్లే వుండేది. ఏదో శ్లోకంలో చెప్పినట్లు, అన్నీ శ్రద్ధగా చేసేది. నా యిష్టానికి వ్యతిరేకం ఆమె యెన్నడూ చెప్పలేదు.

అటువంటిదాన్ని అసలు పెళ్ళే చేసుకోకుండా వుండాల్సింది అన్న నా మాటతో ఆమె మనసు ఎంత గాయపడిందో అనిపిస్తుంది.

'బాధ్యతల బరువులు మోసి మోసి నా భుజాలు కుంగిపోయినయ్. మానాన్న చనిపోయేటప్పటికి నాకు మిగిల్చిన ఆస్తి ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళ చదువులు, కొంత అప్పు. అప్పటికి ఇద్దరి అక్కయ్యలకూ పెళ్ళి అయింది. వాళ్ళ కాపురాలు వాళ్ళు చేసుకుంటున్నారు.

ఎలాగో శర్వాణీ సహకారంతో, ఆమె మంచి మనసుతో చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, తమ్ముళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు, వాళ్ళకి వుద్యోగాలు, అన్నీ ఇంటికి పెద్దకొడుకుగా నా కర్తవ్యాన్ని నిర్వహించాను. కాని వాటి తాలూకు అయిన అప్పు నన్ను ఎప్పుడూ నోరు తెరచిన పెద్దపులిలా భయపెడుతూనే వుంటుంది.

'కొంతమంది ఆడవాళ్ళు తమ కుటుంబ పరిస్థితి అవగాహన చేసుకుని, అర్థం చేసుకోలేక అందని వాటికోసం అర్రులు చాస్తూ, అందులో వాళ్ళు నరకం అనుభవిస్తూ తమ చుట్టూవున్న వాళ్ళకి కూడా ఆ నరకాన్నే పంచుతారు.

శర్వాణి అలా కాకుండా పరిస్థితులకు అనుగుణంగా తెలివిగా మసులుకుని ఇంటిని ప్రశాంత నిలయంగా మార్చింది. తన తల్లి ఇప్పటికీ చనిపోయిన తండ్రిని ఆయన ఏదో చేయలేదని సాధిస్తూనే వుంటుంది. ఎంతమంది మొగవాళ్ళు ఇళ్ళల్లో భార్యల పోరు పడలేక ఆత్మహత్య చేసుకున్నారు!

దేనికీ లోటు చేయకుండా అడిగినంత డబ్బు యిస్తూ, మాటకు ఎదురు చెప్పకుండా వుండే భర్తను ప్రేమగా చూడటంలో గొప్పతనం లేదు.

కానీ భర్త యింటికి వచ్చిన తరువాత అన్ని బరువు బాధ్యతలు తనవిగా భావించి, తన సుఖాన్ని కూడా త్యాగంచేసే శర్వాణి లాంటివాళ్ళు చాల కొద్దిమంది వుంటారు.

'తను యెప్పుడన్నా "శర్వాణీ! నిన్ను చేసుకున్నాను, ఏమీ సుఖపెట్టలేకపోతున్నాను" అంటే—

"అదేమిటండీ! మీరుమటుకు ఏమి సుఖపడుతున్నారండి. మీ జీతంలో మీ స్వంతానికి ఒక్క రూపాయికూడా ఖర్చుపెట్టుకోరు. అయినా నా సర్వస్వం మీ స్వంతం చేసి మీ దగ్గరకు వచ్చాను. అటువంటప్పుడు మీబాధ్యతలు నావి కావా! లోకంలో అందర్నూ ఇంటికి పెద్దకొడుకు, కోడలు తల్లిని చెల్లెళ్ళను తమ్ముళ్ళను గాలికి వదలి, బాధ్యతలు విస్మరించి వాళ్ళసుఖం వాళ్ళు చూసుకున్నారు అని చెప్పుకునే ఆ సుఖం నాకొద్దండీ!"


శర్వాణి మాటలే నాకు కొండంత తృప్తినీ, సంతోషాన్ని ఇచ్చేవి.' భార్య గురించి ఆలోచనల్లోవున్న మోహన్ ఆఫీసులో వున్నసంగతే మర్చిపోయాడు.

గడియారం అందర్నీ ఇళ్ళకు వెళ్ళమని సూచిస్తూ ఐదు గంటలు టంగున కొట్టింది. గబగబా ఫైల్సు సర్ది బైటికొచ్చాడు మోహన్. ప్రొద్దున తను తొందరపాటుతో అన్నదానికి ఏదో సర్ది చెప్పి భార్య మనసు మంచిగా మార్చాలని తొందర తొందరగా ఇంటికొచ్చాడు మోహన్.

మామయ్య వచ్చాడు, మామయ్యవచ్చాడని పిల్లలు కేకలు పెడుతున్నారు. భర్త వచ్చినట్లు శర్వాణి తెలుసుకున్నా బైటకు రాకుండా వంట ప్రయత్నంలో వుండిపోయింది.

తల్లిని, అక్కలను మాట్లాడించి, పుట్టిన చంటివాడిని చూసి, భార్య కనబడక ఒకసారి వంటింట్లోకి తొంగిచూసి బెడ్‌రూమ్‌లోకి వచ్చాడు మోహన్.

అత్తగారు వాళ్ళు వచ్చారని చేసిన టిఫిన్ మోహన్‌కుపెట్టి అప్పుడే అటు



వచ్చిన కొడుకు రవితో "టిఫిన్ పెట్టానని నాన్నతో చెప్పరా" అంది. అతను తండ్రితో ఆ మాట చెప్పి ఆడుకోటానికి వెళ్ళిపోయాడు. భర్త ఎదురువడాలంటే తప్పుచేసినట్లు జంకుతున్నది శర్వాణి.

మోహన్ ఆఫీసునుంచి వచ్చిన దగ్గర నుంచి భార్య మాట్లాడకపోగా కనీసం కనబడకపోవటంతో చాలా చిరాకుగా వుంది. ఇంకా కోపం పోలేదేమో అనుకున్నాడు. వచ్చి టిఫిన్ ముందు కూర్చున్నాడు మోహన్.

మంచినీళ్ళు తీసుకొచ్చిన భార్యను చూసి "ఏం! అలా వున్నావు? ఈ రోజు అన్నం తినలేదా? కళ్ళు ఎర్రబడి వాచినయ్ బాగా ఏడ్చావా?" అడిగాడు మోహన్. ఏమి చెప్పాలో తోచకుండా వుంది శర్వాణికి. ఇంతలో అత్తగారు లోపలకు వచ్చింది, ఏదో కొడుకుతో మాట్లాడటానికి. నిదానంగా అక్కడి నుంచి తప్పుకున్నది శర్వాణి. తల్లితో కాసేపు మాట్లాడి బజారు కెళ్ళాడు మోహన్.


శర్వాణి వంట పూర్తిచేసి, ఆడబడచులకు, పిల్లలకు అన్నం పెడతా రమ్మంది.

మేము మోహన్ వచ్చిన తరువాత తింటాము, పిల్లలకు పెట్టమన్నారు వాళ్ళు. తన పిల్లలకి, వాళ్ళ పిల్లలకి అన్నాలు పెట్టి తను స్నానంచేసి వచ్చింది.

ఇంకా మోహన్ బజారునుంచి రాలేదు. భర్త ఎక్కడికెళ్ళాడోనని భయంగా వుంది శర్వాణికి. 'ఆయనకు ఇంకా తన మీద కోపంపోలేదేమో. లేకపోతే ఇక నీకు నాకు పడదు. ఇన్నిరోజులబట్టి మనసులో ఒకటి పెట్టుకుని బైటకు నాటకమాడావు. నీ అసలు స్వరూపం తెల్సిందని అనాలనుకుంటున్నారేమో? మనసు విప్పి మాట్లాడ్డానికి యింట్లో అందరూ వున్నారు.' ఇద్దరూ భారమైన హృదయాలతోనే వున్నారు.

ఆలోచనల్లో మునిగిపోయివున్న శర్వాణికి బైటనుంచి అత్తగారు "అమ్మాయి! మోహన్ వచ్చాడు. వాళ్ళకు అన్నం పెడతావా? అనటంతో వాస్తవంలోకి వచ్చి తొందర తొందరగా అందరికీ అన్నాలు పెట్టింది. ఆడబడచులతో రమ్మని చెప్పింది. వాళ్ళ వెనకే మోహన్ కూడా వచ్చాడు. "నువ్వుకూడా అన్నం పెట్టుకో శర్వాణీ! మనమేగా. అమ్మకు ఫలహారం అక్కడ పెట్టు. ఆమె కూడా తింటుంది." పెద్దాడబడచు బలవంతంతో అన్నానికి కూర్చోక తప్పలేదు శర్వాణికి.

భార్యనే గమనిస్తున్నాడు మోహన్, అన్నం తింటున్నదా. లేదా అని.... అందరి భోజనాలు అయినవి. వాళ్ళందరికీ



పక్కలు వేసింది శర్వాణి.

అందరూ కాసేపు కబుర్లు చెప్పుకుని పడుకున్నారు. మోహన్ మటుకు ఒక కుర్చీ తెచ్చుకుని పెరట్లో వేసుకుని పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు.

భర్తతో మాట్లాడాలంటే ఎన్నడూ లేనిది భయంగా వుంది శర్వాణికి. అందుకే వంటిల్లు సర్దటం ఆలస్యం చేస్తున్నది. శర్వాణి కోసమే ఎదురుచూస్తున్నాడు మోహన్. చిన్న చప్పుడైనా ఆమేనని తలెత్తి చూస్తున్నాడు.

భర్తతో ఏమి మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి అని మనసులోనే రిహార్సల్ వేసుకొంటున్నది శర్వాణి.

ప్రొద్దున నేను అన్నది తప్పేనని ఒప్పుకుని, భర్తకు తనమీద కలిగిన దురభిప్రాయాన్ని మనసులోంచి పూర్తిగా తొలగించాలని నిశ్చయానికి వచ్చింది. ఒకసారి వెళ్ళి అందరూ పడుకున్నారా, లేదా అని చూసింది.

శ్వేత, రవి వాళ్ళ బామ్మకు చెరొక పక్క పడుకుని నిద్రపోతున్నారు. అద బడుచులు, అత్తగారు ప్రయాణం అలసటతో గాఢనిద్రలో వున్నారు.

ఇప్పటికి ఏకాంతంగా భర్తతో మాట్లాడటానికి సమయం దొరికిందనుకుంటూ కొత్త పెళ్ళికూతురిలా చిన్నగా నడచి అదురుతున్న గుండెతో భర్త దగ్గరకు వచ్చి కింద గచ్చుమీద కూర్చున్నది. అదంతా గమనిస్తూనే మొహం ముందు పుస్తకం తీయకుండా భార్య ఏమి మాట్లాడుతుందోనని వూహిస్తున్నాడు మోహన్. శర్వాణి చెప్పాలనుకున్న మాటలు యెంత ప్రయత్నం చేసినా గొంతుదాటి రాలేదు అప్పటిదాకా బిగపట్టుకున్న కన్నీరు వరద లైంది భర్త సన్నిధిలో. వెంటనే అతని చేతిలో పుస్తకంతీసి భర్త రెండు చేతులూ తన మొహంమీద పెట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది శర్వాణి.

"ప్రొద్దున నేను అన్నదానికే ఇంకా బాధపడుతున్నావా శర్వాణీ! నేను అలా అన్నందుకు నిజంగా ఆఫీసుకెళ్ళిన తరువాత ఎంత బాధపడ్డానో నీకు తెలియదు. నేనసలు ఈరోజు ఆఫీసులో ఏ పనీ చేయలేదు. అందుకే ఐదుగంటలకే వచ్చాను ఇంటికి. కానీ ఈ విషయం మాట్లాడడానికి అక్కయ్యావాళ్ళు వున్నారు. బాగుండదని వూరుకున్నాను. ఇంట్లో నీతో మాట్లాడకుండా వుండలేకనే బజారు కెళ్ళాను." "లేదండీ! మీరేమీ తొందరపడలేదు. నేను అలా అని వుండకపోతే మీరు అనరు. నాకు తెలుసు." "సరే! నువ్వూ నేనూ తొందరపడ్డాం. దానికి, దానికి చెల్లిపోయింది. ఇకముందు ఇలాంటివి జరగకుండా ఇద్దరం జాగ్రత్తపడదాం!" అంటున్న భర్తను చూసి నా భర్త ఇంత మంచివాడా! అనుకున్నది మనసులో! ఈ అపురూపమైన అపేక్షముందు ఏ భోగభాగ్యాలూ దిగదుడుపే అనుకున్నది శర్వాణి.

"శర్వాణీ! నీకొక మంచి వార్త. నా జీతం అరవయి రూపాయలు పెరిగింది. అందుకే నా స్నేహితుడు ఎప్పుడూ వాడుకగా బట్టలు తీసుకునే షాపులో నీకొక పట్టుచీరె, శ్వేతకొక పట్టు పరికిణీ తీసుకుందాం రేపు. ఈ అరవయి ప్రతీ నెలా ఆ షాపుకు కట్టవచ్చు" అని చెప్పాడు మోహన్. అది విన్న శర్వాణి...."శ్వేతకు నా పట్టుచీరె చింపి పరికిణీ కుట్టించాను. దానికి దీపావళికి కుట్టిస్తానని నచ్చచెప్పాను. నాకు పట్టుచీరె వద్దు. వదినగార్లు పండగకు వచ్చారు కాబట్టి, మామూలు చీరలు మా ముగ్గురికీ తీసుకురండి." అంది బాధ్యతగల గృహిణిలా.

శర్వాణి చంపలమీద ఇంకా కన్నీటి చారలు కనబడుతూనే వున్నాయి. మోహన్ నవ్వుతూ "చందమామ యేమంటున్నాడో తెలుసా!

శర్వాణీ! నేను చల్లని వెన్నెల కురిపిస్తుంటే హాయిగా కబుర్లు చెప్పుకోక ఈ ఏడుపులేంటి అని" అన్నాడు.

"నిజమేనండీ! మన జీవితంలో నిజంగా యిది వెన్నెల కురిసిన రాత్రే!

మీకు కోపం వచ్చిందేమో! దాని పరిణామం ఎలా వుంటుందోనని హడలిపోతున్నాను" అంటున్న భార్య మొహాన్ని తన చేతుల్లోకి తీసుకుని, తెల్లని వెన్నెల్లో కొత్త అందాన్ని చూస్తున్నాడు ఆ మెలో మోహన్.

## ఫ్లాష్ లైట్స్

### ఆకలి

కనలుతున్న ప్రేగులనుండి
పుడుతుందొక ఆకలి.
కడుపునిండిన వానిలో
మెదులుతుందొక 'ఆకలి'.

### వైరుధ్యం

పుట్టిన బిడ్డ ఏడిస్తే
అందరి ముఖాలలో ఆనందం.
అతడు మౌనం వహిస్తే
అందరి ముఖాలలో విషాదం.

### బిచ్చగాళ్ళు

ఒకడు బానవంటి బొజ్జతో
కారు ఎక్కి వచ్చాడు.
ఒకడు ఎండిన డొక్కలతో
బొచ్చె పట్టుకొచ్చాడు.

### అసూయ

సూర్యుడు పైకి వస్తుంటే
కలువ ముఖం చిన్నబోతుంది.
చంద్రుడు వెలిగిపోతుంటే
తామర ముఖం దాచేస్తుంది.

—కందేపు సుధాకర్

